# Perspective – దృక్కోణం

*Surya Prasad*

*Padala Charitable Trust, padalasurya@yahoo.com*

*# Perspective – దృక్కోణం*

The perspective is the angle or direction in which a person looks at an object/person/situation. In simple words, it is our point of view.

***ప్రతీ మనిషికీ ఒక దృక్కోణం ఉంటుంది. అది ఆ వ్యక్తి యొక్క మానసిక స్థితిగతులతో, అతని అనుభవాలతో, జీవితంలో ఆ వ్యక్తి ప్రాధాన్యత ఇచ్చే విలువలతో, అతని చుట్టూ ఉండే మనుషులు, పరిస్థితులతో ఇలా..... పలు రకాల కారణాల ప్రభావంతో ముడిపడి ఉంటుంది.***

ఈ కారణాలు మనిషి మనిషికీ భిన్నంగా ఉంటాయి. అందుకే ఏ దృక్కోణమూ – మనదైనా, ఎదుటివారి దైనా అది సాక్షికమే, అసంపూర్ణమే (Relative and Incomplete). ప్రతీ మనిషి తన దృక్కోణాన్ని ఏర్పరచుకోవడంతో పాటు ఇతరుల దృక్కోణం నుండి ఆలోచించే శక్తి కలిగి ఉంటాడు. దీనిని విశేష శక్తి అంటారు, కొంతమంది Open Mindedness అని కూడా అంటారు.

మనిషికి ఈ విశేష శక్తి (Open Mindedness) ఎంత ఎక్కువ ఉంటే అంత పరిణితి సాధించినట్టు. అంత శాంతిని, సామరస్యాన్ని పొందుతాడు. ఇది లోపించిన వాడికి అవతల ఉన్న ప్రతీ మనిషిలో తప్పులు మాత్రమే కనబడతాయి.

**కొన్ని ఉదాహరణలు**

1. **దేవుని మీద నమ్మకం** – ప్రతీ చోటా ఆస్తికులు, హేతువాదులు ఉంటారు. కొంత మందికి దేవుడి మీద నమ్మకం ఉంటుంది, కొంత మందికి ఉండదు. ఈ విషయంలో ఎవరి దృక్కోణం వాళ్లది. కాని నా దృక్కోణం ఏదైనా సరే ఇతరుల నమ్మకాలను గౌరవిస్తూ, వాళ్ళ మనోభావాలు దెబ్బతినకుండా మాట్లాడటం, ప్రవర్తించడం చేయగలిగితే నాకు విశేష శక్తి ఉన్నట్టు. నా జీవితం ఆనందంగా ఉంటుంది. అలా కాకుండా, నా నమ్మకాలే గొప్పవి, అవతలి వాళ్ళవి కావు అనే ఆలోచన ఉంటే అది ప్రమాదకరం.
2. **సర్దుకుపోవడం** – కొంతమందికి సర్దుకుపోవడం ఇబ్బందిగా అనిపించదు. కుటుంబంలో, పనిచేసే ప్రదేశాల్లో రక రకాల మనస్తత్వాల మనుషులు ఉంటారు. అందరితో ఆరోగ్యకరమైన సంబంధాలు నిలవాలంటే కొన్నిసార్లు మనం తగ్గినా, సర్దుకుపోయినా తప్పు లేదు, దానివల్ల మనకి మేలే జరుగుతుంది....అనే దృక్కోణం ఉంటుంది. మరికొంత మందికి నా తప్పు లేకుండా అసలు నేనెందుకు తగ్గాలి అనే భావం ఉంటుంది. రెండూ సాపేక్షమే. ఏది గొప్ప అని చెప్పలేం.
3. **ప్రేమ & అనుమానం** – ఇది సాధారణంగా భార్యాభర్తల మధ్య తలెత్తుతూ ఉంటుంది. *'ప్రేమ ఉన్నచోట అనుమానం ఉండకూడదు. నిజంగా నా మీద ప్రేమ ఉంటే అంత అనుమానం ఎందుకే?'* అంటాడు భర్త. *'ప్రేమ ఉన్నచోటే అనుమానం, భయం, అభద్రతా భావం (Insecurity) ఉంటాయి. ప్రేమ లేకపోతే అవేమీ ఉండవు'* అంటుంది భార్య. ఇక్కడ కూడా రెండు దృక్కోణాలు సాపేక్షమే. ఒకరి మీద ఒకరికి గౌరవం ఉండి, ఇద్దరికీ open mind ఉంటే ఏ సమస్యా రాదు.
4. **మంచితనం** – మంచితనం అనే దానికి ఒక్కొక్కరికీ ఒక్కో దృక్కోణం ఉంటుంది. *'ఎటువంటి మోసాలు చేయకుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నా పని నేను చేసుకుంటాను కాబట్టి నేను మంచివాడిని'* అనే భావం కొందరిది. *'నా పనులు మాత్రమే చేసుకుంటే అది స్వార్థం అవుతుంది. సమాజం నుండి నేను చాలా తీసుకున్నాను, నాకున్నంతలో ఎదుటివాడికి సాయం చేయాలి, అది మనిషి కనీస ధర్మం, అదే మంచితనం'* అంటారు మరికొంత మంది. ప్రపంచంలో

## Perspective – దృక్కోణం


ఎవ్వరూ నేను మంచి వాడిని కాదు అనుకోడు. ఎవరి దృక్కోణంలో వాళ్ళు అంతా మంచివాళ్లే. కాకపోతే అవతలి వారి ఆలోచనలను కూడా అర్ధం చేసుకుంటే ఎటువంటి సంఘర్షణ (conflict) ఉండదు.

5. **పెద్దలను గౌరవించాలి** – ఇక్కడ 'గౌరవం' అనే విషయం లో ఏ సమస్యా లేదు. కాని 'పెద్దరికం' అనే విషయంలోనే వేరు వేరు దృక్కోణాలు ఉంటాయి. *కేవలం వయసులో, అనుభవంలో, ఆకారంలో పెద్దగా ఉంటే చాలు, గౌరవించాలి* అనే భావం కొందరిది. *ఆలోచనలో, ప్రవర్తనలో పెద్దరికం చూపిన వాళ్ళకే గౌరవం ఇవ్వాలి, పిల్లల మీద అరిచే వాళ్లకి, వాళ్ళని దండించే వాళ్లకి, లైంగిక వేధింపులు పాల్పడేవారికి ఎందుకు గౌరవం ఇవ్వాలి? అటువంటి వాళ్ళు పిల్లల స్థాయికి ఎదగాలి. పెద్దలను మాత్రమే కాదు... అందరినీ గౌరవించాలి* అనే భావం మరి కొందరిది.

కాబట్టి దృక్కోణం (Perspective) అనేది సాపేక్షం. There is no perfect perspective in anything. Effective Communication లో perspective అనేది కూడా ఒక barrier అని నిపుణులు చెబుతూ ఉంటారు.

మన పిల్లలకి చిన్నప్పుడే ఇటువంటి విషయాల మీద అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తే, ఎదిగేకొద్దీ వాళ్ళ ఆలోచనలు పరిణితి చెంది, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా, ఎన్ని సమస్యలు వచ్చినా, ఎలాంటి మనస్తత్వాలు ఉన్న మనుషుల మధ్యలో ఉన్నా ఏ మాత్రం తడబడకుండా, సరైన నిర్ణయాలు తీసుకుని, ప్రశాంతంగా, ఆనందంగా జీవిస్తారు. అటువంటి జీవన నైపుణ్యాలు మన పిల్లలకు అలవడాలంటే వాళ్ళతో ఎక్కువ సమయాన్ని కేటాయించి, మన అనుభవాలు, ఆలోచనలు పంచుకోవాలి. తరగతి గదిలో 4 గోడల మధ్య కూర్చోబెట్టి పాఠాలు చెప్పేస్తేనో, ఇంట్లో హోం వర్క్ చేయించేస్తేనో నైపుణ్యాలు రావు. వాళ్లకి బయటి ప్రపంచాన్ని చూసే అవకాశం కల్పించాలి. సహజంగా పిల్లల్లో ఉండే ప్రశ్నించే తత్వాన్ని, సృజనాత్మకత ని ప్రోత్సహించాలి...ఇంట్లో మరియు బడిలో కూడా.

*"అందరూ నాలాగే ఆలోచించనక్కర్లేదు, నా నమ్మకాలు (belief system) నూటికి నూరు శాతం సరైనవి కాకపోవచ్చు. వాటిని మార్చుకునే open mind నాకుంది. ఎదుటి మనిషి వయసుతో, స్థాయితో, సంపాదనతో సంబంధం లేకుండా ఏదోక విషయం నేను నేర్చుకునే అవకాశం ఉంది."* ఇలాంటి ఆలోచనా విధానం మనం ముందు అలవర్చుకోవాలి, తరువాత అది మన పిల్లల్లో కూడా కలిగేలా చెయ్యాలి. అలా అయితేనే మన పిల్లలు విద్యావంతులుగా ఎదుగుతారు, లేకపోతే కేవలం అక్షరాస్యులుగా మిగిలిపోతారు. అది పూర్తిగా మన చేతుల్లోనే ఉంది.




TRUE is your perspective of something whereas

TRUTH is universal and cannot be changed

